'ఉపాధి' చెల్లింపుల్లో సర్కారు నిర్లక్ష్యం

- కేంద్రం వరమిచ్చినా కరుణించని రేవంత్ ప్రభుత్వం
- 700 కోట్ల కేంద్ర నిధులనూ విడుదల చేయని వైనం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తెలంగాణలో నిర్వహించిన పనులకు బిల్లులు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కనీసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం విడుదల చేయడం లేదు. దీనిపై ఆయా పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద గత 9 నెలల్లో దాదాపు రూ.1,000 కోట్ల విలువైన పనులను చేపట్టారు. ఇందుకు అయిన వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 75%, రాష్ట్ర ప్రభుత్వం 25% భరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్రం తన వాటా కింద గత నెలలోనే దాదాపు రూ.700 కోట్లు జమ చేసింది. దీనికి రాష్ట్ర వాటాను కూడా కలిపి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నది. దీంతో ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అంటూ సాకులు చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. కోడ్ ముగిసి వారం రోజులు దాటినా ఆ బిల్లుల ఊసెత్తడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయకపోగా కనీసం కేంద్రం జమ చేసిన నిధులను కూడా విడుదల చేయడం లేదు. పైపెచ్చు ఆ నిధులను ఇతర పథకాలకు మళ్లించినట్టు తెలుస్తున్నది. దీంతో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తమ పరిస్థితి తయారైందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నదని మండిపడుతున్నారు. చివరకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి తమను మభ్యపెట్టిన రేవంత్ సర్కారు ఇప్పటికైనా ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖమ్మంలో ఉద్యోగార్థుల ఆందోళన

- లైబ్రరీ సౌకర్యాల కోసం ఆందోళన
- పోలీసుల బెదిరింపుతో విరమణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 12: ఖమ్మం జిల్లా గ్రంథాలయంలోని సమస్యలపై నిరుద్యోగులు రోడ్డెక్కారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తామంతా గ్రంథాలయానికి వస్తే.. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదంటూ నిరుద్యోగులు, ఉద్యోగార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం పక్కనే ఉన్న బస్ డిపో రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. గ్రంథాలయానికి వస్తే కూర్చోడానికి కుర్చీలు, తాగడానికి మంచి నీళ్లు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. చివరికి అత్యవసరానికి వెళ్దామన్నా కనీసం మరుగుదొడ్లు కూడా లేవని ఆవేదన చెందారు. నిత్యం తాము ఇక్కడ పడుతున్న ఇబ్బందులను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనకు దిగినట్టు చెబుతున్నారు. పోలీసులు వచ్చి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరుద్యోగులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. అయినప్పటికీ తమ సమస్యలను పరిష్కరించాలంటూ పాఠకులు పట్టుబట్టారు. ఆందోళన విరమించకపోతే కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు బెదిరింపులకు దిగారు. దీంతో తమ భవిష్యత్తు దృష్ట్యా ఉద్యోగార్థులు, నిరుద్యోగులు ఆందోళన విరమించారు.

పింఛను పెంపు ఏమాయె?

మొదటిపేజీ తరువాయి...

ఐదు లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. మిగతావారిలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత, గౌడ, హెచ్ఐవీ, బోధకాలు బాధితులు, డయాలసిస్ రోగులు ఉన్నారు.

నిరాటంకంగా ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం

సమాజంలో నిస్సహాయులుగా ఉన్నవారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మొదట పింఛన్‌ను రూ.వెయ్యికి పెంచి అందించింది. రెండో టర్మ్‌లో 2,000కు పెంచింది. 2014 నవంబర్‌లో ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రారంభించి కరోనా లాంటి కష్టకాలంలోనూ నిరాటంకంగా అందించింది. ప్రారంభంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్ఐవీ బాధితులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు పింఛన్లు అందజేసింది. 2015 మార్చి బీడీ కార్మికులకు, 2017 ఏప్రిల్ నుంచి ఒంటరి మహిళలకు, 2018 ఏప్రిల్‌ని ఫైలేరియా బాధితులకు, 2022 ఆగస్టు నుంచి డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లను వర్తింపజేసింది. త్వరలోనే పింఛన్ల చెల్లింపునకు సిద్ధమవున్న కాంగ్రెస్ ప్రభు త్వం, పాత విధానంలోనే వెళ్లేందుకు యోచిస్తున్నట్టు సమాచారం. 44లక్షల మంది లబ్ధిదారులకు పింఛను ఇ వ్వాలంటే నెలకు సగటున వెయ్యి కోట్ల చొప్పున ఖర్చవుతుందని, ఇప్పుడా మొత్తా న్ని రెట్టింపు చేయడం వల్ల మరో వెయ్యి కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. కొత్తగా అసరా పింఛను కోసం ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులన్నీ అటకెక్కినట్టు తెలుస్తున్నది. ఉన్న పింఛన్లను పెంచి ఇవ్వడంపైనే దృష్టిపెట్టని ప్రభుత్వం, కొత్తవి ఎలా ఇస్తుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

- కాంగ్రెస్ సర్కార్ హామీ నిలబెట్టుకోవాలి
- 'మన ఊరు-మన బడి'ని కొనసాగించాలి
- సర్కారు బడులను బలోపేతం చేయాలి
- స్కూళ్లకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

సిద్దిపేటలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకుపైగా పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు డీఎస్సీలో 25 వేల ఖాళీలు నింపుతామని చెప్పి కేవలం 11 వేల ఖాళీలకే నోటిఫికేషన్ ఇచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే 25 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయాలి డిమాండ్ చేశారు. స్కూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో వర్షాకాలంలో వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. 'మన ఊరు- మనబడి' కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కొనసాగించి, ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ స్కూళ్లలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, బడులకు ఉచిత కరెంటు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య అందుతున్నదని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించే బాధ్యత తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రుల ఆలోచనకు అనుగుణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నమెంట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు మెరుగైన విద్య అందించిందని గుర్తుచేశారు. అనంతరం సిద్దిపేట జిల్లా కేంద్ర దవాఖానను హరీశ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యసిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షలు, మందుల కోసం బయటకు పంపవద్దని వైద్యులను కోరారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

టెట్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి...

టెట్‌తో పోల్చితే ఉత్తీర్ణత శాతం పెరగడం విశేషం. పేపర్ -1లో ఏకంగా 30.24శాతం, పేపర్ -2లో 18.88శాతం ఉత్తీర్ణతశాతం పెరిగినట్టు అధికారులు వెల్లడించారు. కాగా, అర్హత సాధించని అభ్యర్థులకు ప్రభుత్వం ఉపశమనం ఇచ్చింది. టెట్ -24లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు డిసెంబర్ టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించింది. టెట్-24లో అర్హత సాధించిన వారికి ఒకసారి డీఎస్సీ పరీక్షకు ఉచితంగా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. టెట్ మెమోలను https://schooledu.telangana.gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు అధికారులు తెలిపారు.

సర్కారు బడుల్లో టీచర్లుగా పనిచేస్తున్న పలువురు టీచర్లు టెట్ పరీక్షను గట్టెక్కలేకపోయారు. తొలిసారిగా రాష్ట్రంలో 33వేలకు మందికిపైగా టీచర్లు టెట్ రాశారు. వీరిలో 18వేల మంది (54%) మాత్రమే టెట్ క్వాలిఫై అయ్యారు. ఏకంగా 15వేల (46%) మంది టీచర్లు అర్హత సాధించకపోవడం గమనార్హం. సబ్జెక్టులవారీగా చూస్తే అత్యధికంగా పేపర్ -2 సోషల్‌లో 56 శాతం టీచర్లు, పేపర్ -2 గణితం, సైన్స్‌లో 49 శాతం, పేపర్ -1లో మరో 21శాతం టీచర్లు అర్హత సాధించలేదు. టీచర్లు టెట్‌లో క్వాలిఫై కాలేదు. టెట్ పరీక్షలను గత మే 20 నుంచి జూన్ 2 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

పేపర్లు, సబ్జెక్టుల వారీగా టీచర్ల అర్హత వివరాలు

సర్వీస్ టీచర్లు	పేపర్ -1	పేపర్ 2 (సోషల్)	పేపర్ -2 (గణితం, సైన్స్)	మొత్తం
దరఖాస్తు చేసిన వారు	9,754	16,462	22,379	48,595
పరీక్షకు హాజరైనవారు	6,449	11,468	15,302	33,219
క్వాలిఫై అయినవారు	5,113	5,128	7,826	18,067
అర్హత శాతం	79.28	44.71	51.14	54.38

పేపర్ల వారీగా క్వాలిఫై అభ్యర్థులు

	పేపర్ -1	పేపర్ -2
పరీక్షకు హాజరైనవారు	85,996	1,50,491
క్వాలిఫై అయినవారు	57,725	51,443
క్వాలిఫై శాతం	67.13%	34.18%

సబ్జెక్టుల వారీగా అర్హుల వివరాలు

	గణితం, సైన్స్	సాంఘికశాస్త్రం
పరీక్షకు హాజరైనవారు	79,138	71,353
క్వాలిఫై అయినవారు	29,601	21,842
క్వాలిఫై శాతం	37.4%	30.61%

ఫలితాలిచ్చాక.. తుది కీ విడుదల

టెట్ ఫలితాల విడుదలలో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. బుధవారం నాడు ఫలితాలు విడుదల చేసిన తర్వాత అధికారు టెట్ తుది కీని విడుదల చేశారు. గతంలో తొలుత ఫైనల్ కీని విడుదల చేసి ఆయా కీ ప్రకారం ఫలితాలను వెల్లడించేవారు. సాధారణంగా ఒక రోజు ముందుగానే ఫైనల్ కీని విడుదల చేస్తారు. కానీ ఇందుకు భిన్నంగా బుధవారం ఉదయం ఫలితాలు విడుదల చేసిన తర్వాత సాయంత్రం ఫైనల్ కీని వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. దీంతో నివ్వెరపోవడం అభ్యర్థుల వంతైంది.

ఉద్యోగ బదిలీ దరఖాస్తుల్లో కొత్త ఆప్షన్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కొత్త జోన్లు, మల్టీజోన్లు, కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటుకు ఉద్దేశించిన జీవో-317పై ఉద్యోగుల్లో వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ బుధవారం సమావేశమైంది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ జీవో కింద దరఖాస్తు చేసుకునే ఉద్యోగులకు మరికొన్ని ఆప్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 14 నుంచి 30 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించా రు. స్థానికత అంశం కీలకంగా మారిన నేపథ్యంలో దరఖాస్తులకు 'లోకల్ స్టేటస్' ఆప్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. కేంద్ర ఉద్యోగులకు (భార్య లేదా భర్త) కూడా అప్షన్ కల్పించారు. మల్టిపుల్ దరఖాస్తులకు సబ్‌కమిటీ అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న ఉద్యోగులకు రసీదు ఇవ్వడమే కాకుండా సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపనున్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా 12,011 దరఖాస్తులను స్వీకరించిన విషయాన్ని కూడా క్యాబ్‌నెట్ సబ్ కమిటీ సమావేశంలో చర్చించారు.

అక్టోబర్‌లో గ్రూప్-1 మెయిన్

- 21 నుంచి 27 వరకు నిర్వహణ
- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- అర్హత పరీక్షగా జనరల్ ఇంగ్లిష్
- పరీక్ష సమయం మూడు గంటలు
- తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలో పరీక్షలు
- నేడు ప్రిలిమినరీ ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్ పరీక్షలను అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ప్రిలిమినరీ పరీక్షలు ఇటీవలే ముగిసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం మెయిన్ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం మెయిన్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు మొత్తం ఏడు రోజులు పాటు నిర్వహిస్తారు. ఇందులో అర్హత పరీక్షగా జనరల్ ఇంగ్లిష్ పేపర్‌ను నిర్ణయించారు. గ్రూప్-1 మెయిన్‌లో మొత్తం ఏడు పేపర్లు ఉంటాయి. గ్రూప్-1 ప్రిలిమిరీలో ఎంపికైన అభ్యర్థులు తప్పకుండా మెయిన్‌కు హాజరు కావడం తప్పనిసరి. ఈ పరీక్షలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలకు ముందుగా ఎంపిక చేసుకున్న భాషలోనే జవాబులు రాయాలి. ఒక పేపర్ తెలుగులో, మరో పేపర్ ఇంగ్లిష్ లేదా ఉర్దూలో రాసిన జవాబు పత్రాలు చెల్లుబాటు కావు. ఈ విషయాన్ని టీజీపీఎస్సీ అధికారులు స్పష్టంగా చెప్పారు. ఈ పరీక్షలను ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్ వివరాలు

సబ్జెక్టు	మార్కులు	పరీక్ష తేదీలు..
జనరల్ ఇంగ్లీష్ (అర్హత పరీక్ష)	150	అక్టోబర్ 21, 2024
పేపర్-1: జనరల్ ఎస్సే..	150	అక్టోబర్ 22, 2024
పేపర్-2: (హిస్టరీ, కల్చర్, జియోగ్రఫీ)	150	అక్టోబర్ 23, 2024
పేపర్-3: (ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్..)	150	అక్టోబర్ 24, 2024
పేపర్-4:(ఎకానమి అండ్ డెవలప్‌మెంట్)	150	అక్టోబర్ 25, 2024
పేపర్-5:(సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్‌ప్రిటేషన్)	150	అక్టోబర్ 26, 2024
పేపర్-6: (తెలంగాణ మూవ్‌మెంట్ అండ్‌స్టేట్ ఫార్మేషన్)	150	అక్టోబర్ 27, 2024

నేడు గ్రూప్—1 ప్రిలిమినరీ ప్రాథమిక కీ విడుదల

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రాథమిక కీని, మాస్టర్ ప్రశ్నాపత్రాన్ని గురువారం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఈ నెల 17వ తేదీ వరకు వాటిని అందుబాటులో ఉంచనున్నట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ బుధవారం తెలిపారు. ప్రాథమిక కీ, మాస్టర్ ప్రశ్నాపత్రంపై ఈ నెల 17వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో పంపాలని అభ్యర్థులకు సూచించారు.

1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్‌కు ఎంపిక

గ్రూప్-1 ప్రిలిమినరీలో అర్హత సాధించిన అభ్యర్థులను 1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్స్ పరీక్షలకు ఎంపిక చేయన్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గ్రూప్-1లో 563 పోస్టులు ఉన్నాయి. 1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్స్ పరీక్షలకు 28,150 మంది అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

మెయిన్ మాడల్ పేపర్లు విడుదల

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మాడల్ ప్రశ్నాపత్రాలు బుధవారం టీజీపీఎస్సీ అధికారులు విడుదల చేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఏడు పరీక్షల మాడల్ ప్రశ్నా పత్రాలను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

రిక్రూట్‌మెంట్ రహస్యం!

మొదటిపేజీ తరువాయి...

తాము ఎక్కడ, ఎలాంటి పొరపాట్లను చేశామో? ఏ కారణంగా ఉద్యోగం దక్కలేదో తెలియక ఎందరో అభ్యర్థులు మథన పడుతున్నారు. జీఆర్ఎల్‌ను ప్రకటించాలని ట్రిబ్‌ను కోరుతున్నా, ఎక్కడా, ఎప్పుడు లేనివిధంగా మొత్తం నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రకటించబోమని ట్రిబ్ తేల్చి చెబుతున్నది. ఇది అభ్యర్థుల్లో అనుమానాలకు తావిస్తున్నది. గత 2018, 2019లో జీఆర్ఎల్‌ను ప్రకటించిన ట్రిబ్ ప్రస్తుత రిక్రూట్‌మెంట్‌లో ఎందుకు పాటించడం లేదని అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత ఐడీలోనూ మార్కులను పెట్టని వైనం

వ్యక్తిగత ఐడీలోనూ ట్రిబ్ మార్కులు వెల్లడించకపోవడం గమనార్హం. సాధారణంగా రాతపరీక్షలో అభ్యర్థి ఎన్ని నెగిటివ్ మార్కులు వచ్చాయి? ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానం ఇచ్చాడు? మొత్తగా వచ్చిన మార్కులెన్ని? ఏ కమ్యూనిటీ, సాధించిన ర్యాంకు ఎంత అనే వివరాలను ఆయా అభ్యర్థుల వ్యక్తిగత ఐడీల్లో ట్రిబ్ గతంలో పొందుపరించింది. కానీ దానికి ఈసారి ట్రిబ్ స్వస్తి పలికింది. ప్రస్తుతం పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ పోస్టులకు మినహా మిగతా పోస్టుల్లో అభ్యర్థులకు ఆ వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించలేదు. డీఎల్ పోస్టులకు పేపర్2 మార్కులను ఇప్పటికీ ప్రకటించలేదు. జేఎల్, పీజీటీ పోస్టులకు పేపర్3 మార్కులను ఐడీల్లో పొందుపరచనేలేదు. టీజీటీకి సంబంధించి 3 పేపర్లకు సంబంధించి ఒక్క పేపర్ మార్కులను కూడా అభ్యర్థుల వ్యక్తిగత ఐడీల్లోనూ కూడా పొందుపరచలేదు.

ప్రక్రియ ముగిశాకే ప్రకటిస్తామంటున్న ట్రిబ్

చాలామంది అభ్యర్థులు తాము ఎందుకు పోస్టుకు ఎంపిక కాలేదో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించారు. ఆయా పోస్టులకు సంబంధించి కటాఫ్ మార్కులు? రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఎలా పాటించారు? సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో ఏ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారనే సమాచారం కోరుతూ ఆర్టీఐకి దరఖాస్తు చేసుకున్నారు. కానీ ట్రిబ్ మాత్రం వారందరికీ ఒకే సమాధానాన్ని ఇటీవల పంపింది. ''నియామక ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతున్నది. మీరు అడిగిన సమాచారం ఇవ్వడం ఇప్పటి పరిస్థితుల్లో సాధ్యం కాదు. ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక దానిని బోర్డు సైట్‌లోనే పెడతాం'' అంటూ ట్రిబ్ తేల్చి చెప్పింది. దీనిపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలు బయట పడతాయనేనా?

గురుకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటన మొదలు ఆ తర్వాత నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్, డెమోల నిర్వహణ.. ఏ ఒక్క అంశంలోనూ పారదర్శకత పాటించలేదని పలువురు అభ్యర్థులు ఆది నుంచీ గగ్గోలు పెడుతున్నారు. కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే వేలాది మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అర్ధరాత్రి వరకు హడావుడిగా నిర్వహించిందని నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలో అనేక తప్పులు దొర్లాయని అభ్యర్థులు మండిపడుతున్నారు. నియామక ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇప్పటికే ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జేఎల్ బోటనీ, జువాలజీ, టీజీటీ, పీజీటీకి చెందిన అనేక మంది అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం ఆయా కేసుల విచారణ కొనసాగుతున్నది. జీఆర్ఎల్‌ను ప్రకటిస్తే మరిన్ని కేసులు మరింతగా పెరిగే అవకాశముంటుందని, ఈ నేపథ్యంలోనే ట్రిబ్ అందుకు జంకుతున్నదని గురుకుల అభ్యర్థులు వివరిస్తున్నారు. ఇప్పటికైనా గతంలోలా సైట్‌లో జీఆర్ఎల్‌ను, వ్యక్తిగత ఐడీల్లో మార్కులను పొందుపరచి పారదర్శకతను నిరూపించుకోవాలని అభ్యర్థులు ట్రిబ్‌ను డిమాండ్ చేస్తున్నారు.

'దోస్త్' సెల్ఫ్‌రిపోర్టింగ్ గడువు పొడిగింపు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్లు కల్పించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మొదటి విడుత ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. బుధవారంతో గడువు ముగియగా, ఈ నెల 15 వరకు అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. దోస్త్ రెండో విడుత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల గడువును 15 వరకు పొడిగించామని వెల్లడించారు.

లోపం ఎక్కడ.. ఎవరిదో గుర్తిస్తాం

- తప్పుడు అఫిడవిట్లు ఇస్తే చర్యలు
- విజిలెన్స్, కాగ్ సంస్థలనూ విచారిస్తాం
- 'జ్యుడీషియల్' కమిషన్ చైర్మన్, జస్టిస్ ఘోష్
- బరాజ్‌ల నిర్మాణ ఏజెన్సీలతో విచారణ

హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో లోపం ఎక్కడ, ఎవరివల్ల జరిగిందో సహేతుకంగా గుర్తిస్తామని జ్యుడీషియల్ ఎంక్వయిరీ కమిషన్ చైర్మన్, జస్టిస్ పీసీ ఘోష్ వెల్లడించారు. విచారణలో భాగంగా బుధవారం ప్రాజెక్టు నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జస్టిస్ ఘోష్ మాట్లాడుతూ నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించామని, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్న ఆదేశాల మేరకు పనులు చేసినట్టు వెల్లడించారని తెలిపారు. అన్ని అంశాలపై నెలాఖరులోగా అఫిడవిట్ దాఖలు చేయాలని అదేశించానని, వాటిని పరిశీలించాక అవసరమైన వారిని విచారణకు పిలుస్తామని, లోపం ఎక్కడ జరిగింది? ఎవరి కారణంగా జరిగిందన్న విషయాన్ని తేలుస్తామని తెలిపారు. కమిషన్‌కు ఎవరు ఏది చెప్పినా ప్రతిదీ రికార్డు రూపంలో ఉండాలని, సరైన ఆధారాల కోసమే అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతున్నామని, తప్పుడు అఫిడవిట్ ఫైల్ చేసేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విజిలెన్స్, కాగ్ రిపోర్టులు కూడా ఉన్నాయని, ఆయా సంస్థలవారిని కూడా పిలిచి వివరాలు తీసుకుంటామని, నేడు కూడా విచారణ కొనసాగుతుందని వెల్లడించారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	41.3°c	27.0°c
మెదక్	41.3°c	21.9°c
వరంగల్	37.0°c	27.0°c
నల్లగొండ	36.5°c	25.0°c
మహబూబ్‌నగర్	36.3°c	27.1°c
కరీంనగర్	36.0°c	27.0°c
నిజామాబాద్	34.1°c	25.4°c
రంగారెడ్డి	33.7°c	21.7°c
ఖమ్మం	33.0°c	26.0°c
హైదరాబాద్	32.6°c	23.0°c

రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి

మరో 3 రోజులు వర